# మరీచిక

రచన:
శ్రీ చింతూరి మల్లిబాబు.

సుకుమారమైన వళ్లు కలుపకలిగి ఆ ఒంటికి రంగూ. అపురూపమైన శంపాలతలు చెదిరి ఆకళ్ళకు మెరుపూ కలిగించాయేమో ననిపిస్తుంది ఆమెను చూస్తుంటే. అందుకే ఆమె అంటే అంత ఇష్టం శరత్‌కి. ఇంకా ఆమెలో చాలా ప్రత్యేకతలు కనిపించాయి అతనికి. ఆమె నవ్వు సుతారమైన వెన్నెల ఆమె మాటలు వీణతీగల మీటులు, ఆమె నడక అందమైన లేడిగమనం. అందరికీ ఆమెలో ఇన్ని అందచందాలు కనిపించకపోవచ్చు, కాని అతనికి మాత్రం ఆమె నాగలోకంనుంచి నడచివచ్చిన నవమోహిని! అంతే కాదు. నున్నని నల్లరాతిలో నిపుణుడైన శిల్పి ప్రతిభావంతంగా, ఒంపు సొంపులతో మనోహరంగా తీర్చి దిద్దిన శిల్పసుందరి ఆమెలో రూపు కట్టిందా అనిపిస్తుంది. అందుకే మొదటిసారి ఆమెని చూడగానే ఆకర్షింపబడ్డాడు అతను. కాని వెంటనే ఆమెని పరిచయం చేసుకోవడంగానీ, హద్దు మీరి ప్రవర్తించడంగానీ అతను చేయలేదు.

శరత్ ప్రస్తుతం నిరుద్యోగి. అందరు నిరుద్యోగులకు మల్లేనే అతనూ తరచు వాంటెడ్ కాలమ్సు వెదకడం, అవకాశ ముంటాయనుకున్న ఉద్యోగాలకల్లా అప్లికేషన్‌లు పంపడం, తరవాత ఇంటర్వ్యూలకీ - టెస్టులకీ హాజరు కావడం అతని పని.

ఆ కార్యక్రమంమీదే ఆ ప్రక్కనున్న పల్లెనుంచి ఆ పట్నానికి తరుచు వచ్చిపోతూండడం అతని కలవాటు. అలాంటిసమయంలోనే ఒకసారి అక్కడి ఉమెన్స్ కాలేజీ దగ్గర ప్రహరీగోడప్రక్కన ఫుట్‌పాత్‌మీద నుంచుని బస్సుకోసం కాబోలు వెయిట్‌చేస్తూ ఆమె కనిపించింది అతనికి.

శరత్‌కూడా తన పనిమీద ఎటోపోయి వస్తూ, అక్కడాగి బస్‌కోసం నిరీక్షిస్తూండిపోయాడు. కాలేజీ వదలి చాలాసేపయినట్లుంది, అమ్మాయిలంతా వెళ్ళిపోయినట్లున్నారు. ఆమెమాత్రం అక్కడ నిలబడి, నాజూకులుపోతూ తన స్నేహితురాళ్ళతో ఏవో కబుర్లు చెప్తోంది. ఆ నలుగురు అమ్మాయిల్లోనూ ఆమెమాత్రం ప్రత్యేకమైన వ్యక్తిత్వంతోనూ, అద్భుతమైన ఆకర్షణతోనూ అతన్ని వెంటనే ఆకట్టుకుంది. అతని హృదయంమీద గాఢమైన ముద్రని వేసింది. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అన్నది, అతనిపట్ల నిజంగా నిజమైనట్లనిపించింది - ఆక్షణంలో.

ఆమె తన ఫ్రెండ్సుతో మాట్లాడుతూ, ఒకసారిమాత్రం కళ్ళు త్రిప్పి శరత్‌వైపు అలవోకగాచూసి, మళ్లీ తనదృష్టి మరల్చి, యథాలాపంగా తన యిష్టాగోష్ఠిలో లీనమైపోయింది. అంతే! అప్పటినుంచి ఆమెరూపం అతని హృదయమందిరంలో 'దేవత' అయింది. ఆ రోజునుంచే ఆమె ధ్యానం నిత్యకృత్యమైంది.

ఆ తర్వాత అదేం అదృష్టమోగాని ఆమె చాలాసార్లు దర్శనం అయింది శరత్‌కి. తను కావాలని ఆమెని చూడాలని ఆమెకోసం వెళ్ళేవాడుకాదు అతడు. కాని ఆమె, తలవనితలంపుగా అనుకోనివేళల్లో వివిధప్రదేశాల్లో అతనికి తటస్థపడుతుండేది. అతను ఆశ్చర్యపడేవాడు - ఇలా ఎందుకు జరుగుతోందా అని. తనకూ ఆమెకూ ఏదో అనుబంధం ఉంది - అందుకే ఇలా జరుగుతోందేమో అనుకున్నాడు కూడా.

కాలేజీకి వెళ్ళేప్పుడో, లేక తిరిగి వచ్చేటప్పుడో, అదీ కాదంటే ఏ షాపింగు ధగ్గరో, ఏ థియేటర్‌వద్దో, మరే బస్ స్టాపుకాడో ఆమె అకస్మాత్తుగా ఎదురుపడేది. ఆమె అలా కనిపించినప్పుడల్లా ఏదో అనుభూతిలో తేలిపోయేవాడు. ఆమె మాత్రం అతన్ని అంతగా గమనించినట్లుగా వుండేది కాదు. ఏదో ఒకసారి అతనివైపు అలా చూసి, మళ్ళీ తన భావనలో తనుండేది. అతనికిమాత్రం ఆమె అలా తనవైపు చూసినప్పుడు ఆ చూపులో ఏదో ఆత్మీయత కనిపించేది. అది నిజమో, తన భ్రాంతో అనుకునేవాడు.

ఇలా రోజులు, నెలలు గడిచిపోయాయి. కాని యింతవరకు ఆమెతో పళ్ళెత్తి ఒక్కమాట మాట్లాడలేదు. కన్నెత్తి ధైర్యంగా ఒక్కచూపు ఆమె కళ్ళల్లోకి చూడలేదు. అంతేకాదు - అస్తమానం అక్కడా యిక్కడా ఆమెకి తను తటస్థపడుతూండడం కూడా, ఆమె మరోలా భావించడానికి ఆస్కారం ఏర్పడుతుందని శంకకూడా అతనికి కలక్కపోలేదు. నిజానికి తానామెకి తరుచు ఎదురుపడుతూండడం యాధృచ్ఛికమే అంటున్నప్పటికీ, ఆమెను తను కావాలని వెంటాడుతూన్న రోడ్‌సైడ్ రోమియోలాగా భావించి అపోహపడే ప్రమాదం ఉంది. అలా జరిగితే ఎంత అసభ్యంగా ఉంటుంది. అందుకే ఆమెకలాంటిభావన కలగకుండా ఉండేందుకు సాధ్యమైనన్ని జాగ్రత్తలు తీసుకోవాలనుకున్నాడు ఇంతమంచి శరత్.

ఇటీవల ఆమె ఎక్కడైనా కనిపిస్తే, ఆమెని గమనించనట్లుగా గబగబా తల వంచుకుని వెళ్ళిపోతున్నాడు అతను. ఆ తర్వాత - ఆమె తరుచు తటస్థపడే ప్రదేశాలు తప్పించి, ఇతరచోట్ల తిరగడం మొదలెట్టాడు. ఆ ప్రాంతంలో అత్యవసరమైన పనులున్నప్పటికీ - సందుదార్లో వెంటవెళ్ళి తిరిగొస్తున్నాడు. ఆమె కాలేజీకి వెళ్ళే సమయం, తిరిగి వచ్చేసమయం విడిచిపెట్టి, మిగతాసమయాల్లో ఆ కాలేజీ రోడ్డువెంట రాకపోకలు సాగిస్తున్నాడు. ఇంతకీ ఆ మహిళా కాలేజీవున్న ప్రాంతమే ఆ టౌన్‌లో అతి ముఖ్యమైన ప్రదేశం. ఆఫీసులూ, షాపులూ ఆ వీధిలోనే ఎక్కువగా ఉన్నాయ్. అనేకపనులకొరకు అతను ఆ స్ట్రీటులో తిరుగక తప్పదు. కాని సాధ్యమైనంతవరకు ఆమె కంటి పడకుండా జాగ్రత్తగా తప్పించుకొని తిరుగుతున్నాడు. తన యీ ప్రదర్శన తనకే విచిత్రం అనిపించింది శరత్‌కి.

ఇలాంటి పరిస్థితిలో ఒకరోజు - కాలేజి అమ్మాయిలు బయట కనిపించే అవకాశంలేని సమయంలో అతను ధీమాగా ఆ వీధిగుండా నడిచివెళ్ళి కాలేజి దాటి, అవతల కొంచెం దూరంలో ఉన్న పోష్టాఫీసుకు చేరుకుని, ఉద్యోగం కోసం దరఖాస్తుఫారం నింపి, కవర్లోపెట్టి, స్టాంపులంటించి, రిజిష్టరుచేసి, రసీదు తీసుకుని, కౌంటర్ వద్దనుంచి ఇటు తిరిగాడో లేదో - ప్రక్కనే అతనికి చాలా సమీపంలో ఆమెముఖం కనపించింది. అతను ఒక్కసారి తృళ్ళిపడి: సర్దుకుని, మరుక్షణంలో అక్కడ్నుంచి నిష్క్రమిద్దామనుకునేంతలో, మరింత దగ్గరికివచ్చి - 'హల్లో మీరా? ప్లీజ్' మీ పెన్ కొంచెం యివ్వండి' అంది. వీణ మీటుతున్నట్లు మాధుర్యాలు వొలికిపోయినట్లు.

'ఓ యస్, తీసుకోండి!' అని వెంటనే తీసి ఆమె కందించాడు అతను, అతని ఆశ్చర్యానికి, ఆనందానికి అంతులేదు.

ఆమె 'టెలిగ్రావ్‌ఫారం'మీద మేటర్రాసి, కౌంటర్‌లో ఇచ్చి, తరువాత శరత్ దగ్గరికివచ్చి 'థాంక్స్!' అంది పెన్ అందిస్తూ.

'నో మెన్షన్!' అన్నాడు పెన్ తీసుకొంటూ.

పెన్ను చేతులు మారేటప్పుడు-ఇద్దరివ్రేళ్ళూ స్పర్శించుకుంది. ఆ స్పర్శ అతనికి గిలిగింతలు పెట్టినట్లయింది.

'ఈమధ్యన మీరు మరి కనిపించడంలేదు!' ఆమె ఆసక్తితో ప్రశ్నించింది.

అయితే ఆమె తనని బాగానే గమనిస్తోందన్నమాట - అనుకున్నాడు శరత్. అయితే తనగురించి ఆమె భావనేమిటో అనుకోకుండానే అతనికి సిగ్గనిపించింది. ఆసమయంలో ఏం సమాధానం చెప్పాలో తెలియక అలాగే ఉండిపోయాడు సంశయిస్తూ.

'ఇదివరకు నే నెక్కడుంటే అక్కడ తటస్థపడేవారు. ఇప్పుడెందుకు మానేశారు?' ఆమె కొంటెగా నవ్వుతోంది.

'అయాం సారీ! యాక్సిడెంటల్‌గా మీకు తటస్థపడుతుండేవాణ్ణి, అంతేగాని ప్రత్యేకించి మిమ్మల్ని ఫాలో అవడం గాదు. ప్లీజ్ డోంట్ థింక్ అదర్‌వైజ్!' అతను అపరాధిలా సంజాయిషీ యిచ్చుకుంటున్నాడు.

'డోంట్ వర్రీ! తమాషాకన్నాను - అంతే కావచ్చు. కాని ఇటీవల మీరు అకస్మాత్తుగా కనిపించడం మానేసేసరికి, నేను నిజంగా డిసప్పాయింటయ్యాను!' ఆమె అనుకుంది తారసంగా.

'నిజంగానా?'

'రియర్లీ! ఇంతటి పెద్దమనిషి ఇంతలో ఏమయ్యాడబ్బా! అనారోగ్యమా? ఏదన్నా ఆపదా? అని ఎంత ఫీలయ్యానో చెప్పలేను,' ఆమె చెప్పుకపోతోంది.

'అలాగా? నిజానికి నేనే మీకు కనిపించవద్దని తప్పుకుని తిరిగాను. అస్తమానం మీరు మీటవుతుంటే మీరేమనుకుంటారోనని డౌటేసాను:' అతను మెల్లగా నిజం చెప్పాడు.

'భలేవారే! ఈమధ్యన మీగురించే అస్తమానం థింక్ చేస్తున్నా తమాషాగా - తలుచుకోగానే తటాల్న దర్శనం యిచ్చే మనిషిగావున్న మీరు, హటాత్తుగా మాయమై కనిపించకుండాపోతే ఎంత ఆశ్చర్యంగా ఉంటుంది! నిజంగా నేను ఎంతో దిగులుపడ్డానంటే నమ్మండి!' ఆమె విచిత్రంగా మాట్లాడేస్తోంది.

'ఇంత యిదిగా మాట్లాడుతున్నారు. నాలో అంత ప్రత్యేకతేముంది?' అర్థంకానట్లు అడిగాడు.

'బుద్ధిమంతుడైన అబ్బాయిలా కనిపిస్తున్నారు. అంతో యింతో ఆర్టిస్టిక్ హృదయం వున్నట్లుంది. అందుకే మీ కళ్ళల్లో అంత ఎడ్మైర్! అందుకే మీరంటే ఆరోజు మా కాలేజివద్ద తొలిచూపులోనే ఆసక్తి కలిగింది మీమీద. క్రమంగా మీ ప్రవర్తనవల్ల, మీ ప్రత్యేకమైన వ్యక్తిత్వం వల్ల మీమీద ఎంతో గౌరవం ఏర్పడింది, మీరు అందరిలాంటి కాకతాయి అబ్బాయిలుకారని తేలిపోయింది. అందుకే మీగురించి అంతగా ఆలోచిస్తున్నాను!' అంది ఆమె ఎంతో ఉద్వేగంగా.

'అయితే నేను నిజంగా చాలా అదృష్టవంతుణ్ని!' అతను పరవశించి పోయాడు.

'నేనుకూడా అదృష్టవంతురాల్నే -' ఆమె ఆర్ద్రంగా అంది.

అప్పటికే వాళ్ళిద్దరూ పోస్టాఫీసు ఆవరణదాటి - వీధి గుండా చాలాదూరం వచ్చేశారు మాట్లాడుకుంటూ.

క్రాసురోడ్లవద్ద యిద్దరూ ఆగిపోయారు.

'ఏమిటి మీ నెక్స్ట్ ప్రోగ్రాం ?' ఆమె అడిగింది.

'ఏముంది? తిరిగి మావూరికి వెళ్ళిపోవడం.'

'అయితే ఈ టౌన్లో కాదన్నమాట మీరుండేది?'

'కాదు. ఈ టౌనుకు అయిదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ పల్లెటూరు.

'ఐ సీ. ఇక్కడే ఏదన్నా జాబ్ చేస్తున్నారేమో అనుకున్నా!'

'జాబా? ఎన్నిడిగ్రీలున్నా ఈదేశంలో సామాన్యులకి జాబులు దొరకడం అంత తేలికేం కాదు.

'అయితే ప్రస్తుతం మీరు నిరుద్యోగులన్నమాట.' ఆమె గొంతులో కొంత నిరుత్సాహం,

'కాని ఈమధ్యనే నాకో ఉద్యోగం దొరుకుతుందని నమ్మకంగా ఉంది,' అన్నాడు నిబ్బరంగా.

'మీ ఆత్మవిశ్వాసానికి నా జోహార్లు!' అంది ఆమె.

అది అవహేళనో, ఆకాంక్షో అతనికి అర్థం కాలేదు.

మాట మారుస్తూ—'ఇంతకీ మీప్రోగ్రాం ఏమిటి? ఇవాళ కాలేజి లేదా!' అడిగాడు.

'ఎందుకు లేదు? ఇవాళ మనస్సు ఆదోలాగ వుంది. అందుకే కాలేజికి పోలేదు. ఇంతసేపూ ఒక సమస్య గురించి ఇంట్లో ఆలోచిస్తూ కూర్చున్నా, ఆఖరికి ఒక నిర్ణయానికి వచ్చి మావాళ్ళకి టెలిగ్రాం ఇద్దామని ఇటు వచ్చా!' ఆమె చెప్పింది.

'సారీ? మీ కభ్యంతరం లేకపోతే మీ ప్రాబ్లం ఏమిటో చెప్తారా?' అనుతాపం ప్రకటిస్తూ అడిగాడు అతను.

'అందువల్ల మీకేంటి ప్రయోజనం?' ఆమె నిర్వేదంగా అంది.

'నాకూ ఆందోళనగానే ఉంది, మీ పరిస్థితి చూస్తుంటే? విషయమేమిటో తెలుస్తే, మీతోబాటూ నేనుకూడా ఆ బాధలో పాలు పంచుకుందామని—' మెల్లగా అన్నాడు.

'గొప్పవారే!—' ఆమె నిరుత్సాహంగా నవ్వింది.

'చెప్పరా!' అతడు బాధపడుతున్నట్లు అడిగాడు.

'చెప్పడాని కేముంది? మామూలు కథే, ప్రతీ ఆడపిల్లకు తప్పకుండా ఎదురయ్యే సమస్యే! పెళ్ళి సమస్య!' అని కొంతసేపాగి 'మా పెద్దవాళ్లు నన్ను పెళ్ళికి తొందర పెడుతున్నారు. నాకో మేన బావున్నాడు. అతనితో నాపెళ్ళి జరిపించాలని మావాళ్ళ ఆరాటం. అందుకోసం నన్ను వత్తిడి చేస్తున్నారు' అంది.

'మీయిష్టం తెలుసుకోకుండానేనా!'

'నా యిష్టాయిష్టాలతో వాళ్ళకు పనేంటి? నాకు మూడు ముళ్ళూవేయించి తమబాధ్యత వదిలించుకుందామని వాళ్ళ ఆలోచన. మాది సామాన్యకుటుంబం. పెద్ద పెద్ద కట్నాలు పోసి, మంచి మంచి సంబంధాలు తీసుకరాలేరు. అందుకు కొద్దిగా చదువుకుని, కొద్దికట్నంతో సంతృప్తిపడే మా మేన బావ సంబంధం నాకు చేసెయ్యాలని మావాళ్ళ సంకల్పం. ఆలస్యంచేస్తే ఈ సంబంధమూ జారి పోతుందేమోనని మా వాళ్ళ భయం. కొబట్టి వెంటనే ఈ సంబంధం ఖాయపర్చుకుని, ముహూర్తాలు పెట్టుకుని, నా పరీక్షలై పోగానే, వేసవిలో పెళ్ళి చేసెయ్యాలని వాళ్ళు నిర్ణయించుకున్నారు. రేపు పెళ్ళిచూపులుకూడా నిశ్చయించేసి, నన్ను రమ్మని ఉత్తరం రాశారు.

'అయితే మీరేం నిర్ణయం తీసుకున్నారు?'

USE ALWAYS..........
Ramu® VESTS
4964-80 ISI FINE
Noble® KNIT-WEAR
Mfrs
Phone: 22012
Ramu Hosieries : : Lakshminagar-TIRUPUR-638 602.

బపితా వారి...
ప్రత్యేక తయారింపులు
• సీవోర్, • చూస్‌త్రీ,
• రావ్ టూ, • సెలెక్ట్ ఒన్
• దట్ సెలెక్షన్.
ఇవే మా ప్రత్యేక తయారింపులైన
జెట్టీలు - బనియన్లు.
తయారించువారు :
Phone : 22909
BAPITA KNITTERS
Lakshmi Nagar, Tirupur 638 602.

'మావాళ్ళకి దూరంగా యిక్కడ మా బంధువులింట్లో వుండి చదువుకుంటున్నాను, ఇంకొద్దినెలల్లో నా బి. ఏ. ఫైనలు అయిపోతుంది. ఆ తరవాత యిక్కడే ఏదన్నా ఉద్యోగం చూసుకుంటాను. నాకు నచ్చినవాన్నే, నన్ను మెచ్చినవాన్నే నేను పెళ్ళి చేసుకుంటాను. అంతేకాని, కట్నం తక్కువని, తక్కువ్తిపడి మావాళ్ళ నిర్ణయానికి తలవంచి ఆ పల్లెటూరి మొద్దుని పెళ్ళి చేసుకోలేను, అందుకే నాకీసంబంధం ఇష్టంలేదని యింతకుముందే టెలిగ్రాం యిచ్చేశాను!' అంది ఎంతో తాపీగా ఆమె.

'మీరు తొందరపడుతున్నారేమో!'

'తొందరేం లేదు. బాగా ఆలోచించే ఈనిర్ణయానికి వచ్చాను,'

'సరే, మీ యిష్టం. మీమనసు బాగా లేనట్లుంది. మరోసారి మీటవుదాం, వస్తా!' అతను ఆమెవద్ద సెలవు తీసుకుని అక్కడినించి వెళ్ళిపోదామనుకుంటున్నాడు. కాని - 'ప్లీజ్! ఆగండి!' అందామె. అతను ఆగిపోయాడు.

'మీ కభ్యంతరంలేకపోతే నాతో ఈరోజు సినిమాకొస్తారా?'...ఆమె అడిగింది.

అతను ఆశ్చర్యపడి 'అల్‌రైట్! అలాగే!' అన్నాడు సంసిద్ధతను ప్రకటిస్తూ.

ఇద్దరూ సినిమావైపు నడక సాగించారు.

'అన్నట్లు - మీపేరు?' ఆమె అడిగింది.

'శరత్ -' అతను చెప్పాడు.

'బాగుంది - ఆపేరు నాకు చాలా యిష్టం!' ఆమె మెచ్చుకుంది.

'మరి - మీపేరు?' అతను అడిగాడు ఆమెని.

'గీత!' ఆమె సమాధానం.

'వెరీ ఫైన్! నాక్కూడా ఈ పేరు చాలా యిష్టం.' అతను తన అభిప్రాయం వెలిబుచ్చాడు.

'ఈ డ్రెస్సులో నేనెలా ఉన్నాను?' గీత అడిగింది - తనని నిలువెల్లా ఒకసారి పరిశీలించుకొంటూ.

శరత్ ఇంతకు ముందునుంచీ చూస్తూనే ఉన్నాడు - ఆమె అలంకారాన్నీ, అందాన్నీ.

'ఈ మెరుస్తున్న ఆకుపచ్చ దుస్తుల్లో మీరు అచ్చం ధనలక్ష్మిగా ఉన్నారు!' అతను అభినందించాడు తృప్తిగా.

ఆమె మధురంగా నవ్వింది. ఆమె అలా నాజూకుగా నవ్వుతుంటే వెన్నెల కురిసింది బుగ్గల్లో అస్పష్టంగా గులాబిరంగు ప్రవహించింది.

అలా కలిసిపోయింది వాళ్ళస్నేహం - అనురాగం!

ఆ తరువాత ఎన్నో సినిమాలకి, ఎన్నో హోటల్లకి మరెన్నో విహారాలకి వెళ్ళారు.

* * *

ఇప్పుడు గీతని చూడకుండా శరత్ ఉండలేడు, శరత్‌ని చూడకుండా గీత ఉండలేదు. అంత ప్రగాఢంగా అల్లుకుపోయింది వాళ్ళ అనుబంధం!

శరత్‌కి ఇంకా ఉద్యోగం దొరకలేదు. గీత డిగ్రీ ఫైనలు పరీక్ష రాసింది.

గీత తన స్వగ్రామం వెళ్ళిపోవడానికి సన్నాహాలు చేసుకుంది.

ఆఖరుసారిగా టౌనుకు దూరంగా ఏటిపక్కన ఇసుకలో కబుర్లు చెప్పుకొంటున్నారు ప్రేమికులిద్దరూ.

గీత హటాత్తుగా అంది—'మీరు ఇక్కడ యింత ఖర్చుపెట్టి ఈ ఇంటర్‌వ్యూలకి తిరగడంకంటే, ఏ అరబ్ కంట్రీస్‌లో జాబుకోసమో ట్రై చెయ్యడం మంచిదికదా!'

శరత్ అదిరిపడ్డాడు—'అరబ్‌దేశాల్లో ఉద్యోగాలంటే మాటలా? ఎంతో డబ్బు ఖర్చుపెట్టాలి. ఎన్నో అవస్థలు పడాలి!' అతను నిరుత్సాహంగా అన్నాడు.

'అయితే మాత్రం. బోల్డు డబ్బు సంపాదించొచ్చు! లక్షాధికారుల మైపోవచ్చు. కార్లూ - మేడలూ కొనొచ్చు. అరబ్ కంట్రీస్‌లో జాబు లిప్పించేందుకు, ప్యాసుపోర్టులు గట్రా పుట్టించేందుకు యిండియాలో చాలా ఏజన్సీలున్నాయి. వాటిద్వారా మీరు జాబ్‌కోసం ట్రై చెయ్యండి!' ఆమె సలహా యిచ్చింది.

'వాటిలో కూడా చాలా మోసాలున్నాయి. అయినా. ఆ అరబ్ కంట్రీసులో మాత్రం ఏముంది? పెట్రోలూ-గలీజూ'.

'శలేవారే, అలా తీసిపారెయ్యకండి, ఎంతెంతమంది అరబ్ కంట్రీస్‌కి ఎగబడుతున్నారో తెలుసా? ఇప్పటికే అక్కడ చాలామంది మనవాళ్ళున్నారు. అక్కడున్నది పెట్రోలు కాదండి—గోల్డు. అక్కడవాళ్ళు గోల్డుతో బిల్డింగులు కట్టించుకుంటారటండి!' ఆమె ఉత్సాహంగా చెప్పుకుపోతోంది.

నామాట విని మీరు గట్టిగా ప్రయత్నం చెయ్యండి. అరబ్ కంట్రీస్‌కి వెళ్ళండి. ఇక్కడేముందండి, ఇండియాలో మట్టి! అంతా పావర్టీ - డర్టీ ....' గీత అసహనంగా మాట్లాడింది.

శరత్ విస్తుపోయాడు.

'మరిచిపోకండి, అరబ్ కంట్రీస్‌కి తప్పకుండా ట్రై చేస్తారుగదూ!' అంటూ గీత హెచ్చరించింది,

అలా ముగిసింది వాళ్ళ చివరిసమావేశం.

• • •

మరునటిరోజు గీత వాళ్ళ స్వగ్రామం వెళ్ళిపోయింది.

ఆ వెళ్ళిపోవడం, వెళ్ళిపోవడం మళ్ళీ కనిపించలేదు. గీత, విరహంలో - వేదనతో వేగిపోతున్నాడు శరత్.

రెండునెలలతర్వాత గీతవద్దనుంచి ఉత్తరం వచ్చింది.

మైడియర్ శరత్—

'నేను కువైట్ వెళ్ళిపోతున్నాను. నా ఫ్రెండ్ ఒకతను అక్కడ జాబ్ సంపాదించాడు. నాకుకూడా జాబ్‌కోసం ట్రై చేస్తున్నాడు. అంతేకాదు. నిన్నటిరోజే మా ఫ్రెండూ నేనూ రిజిష్టరు మేరేజ్ కూడా చేసుకున్నాం. నన్ను క్షమించు మిష్టర్! నీవు ఇండియాని వదలనంటుంటివి. ప్చ్. ఏం చేస్తాం! నాకు ఎన్నో ఆశలున్నాయి: ఉజ్జ్వల భవిష్యత్తు కోసం ఉవ్విళ్ళూరేదాన్ని! అందుకే నీకు దూరంగా వెళ్ళిపోతున్నాను, దూరతీరాలకి ఎగిరిపోతున్నాను. మనం గడిపిన ఆ రోజులు నా జీవితంలో ఎల్లప్పుడూ మధురస్మృతిగా దాచుకుంటాను. సెలవ్, గుడ్‌బై.

నీ
గీతారాణి.

శరత్ ఆ ఉత్తరం చదివి దిగ్భ్రాంతి చెందాడు. అగాధంలోకి కుంగిపోయాడు.

ఈ వ్యవస్థలో డబ్బు ఎంతపని చేయిస్తోంది. జీవితాలతో చెలగాటాలాడుతోంది. అనురాగాల్ని త్రుంచి, అనుబంధాల్ని త్రెంచి, ఎక్కడెక్కడికో విసిరేస్తోంది. ఇది జీవితం కాదు - మరీచిక!'




మా ప్రత్యేక తయారింపులు!!

* డి. ఆర్. ఫైన్ * మాసర్
* బజాజ్ ఫైన్ * ఐలెట్
* కూల్ టెక్స్ * కాపిటల్
* సంగమ్ ఇంటర్‌లాక్ * ఓవిన్
* టిప్‌టాప్ * కింగ్ కాంగ్
* స్కై రాజ్ * రాకెట్

ఇవికాక * జెట్టీలు * లండన్ * సిమిత * బాబి

అన్నిరకాల కలర్ వర్టులు మరియు ఫాన్సీరకాలు

అన్ని ప్రముఖ బట్టల షాపులోనూ దొరుకును.

BAJAJ KNITTERS - Lakshminagar - Tirupur - 638 602.